RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

సంపుటి - 01 సంచిక - 297 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

గురువారం 4 జూలై 2024

## అందరికీ అందుబాటులో ఉచితంగా ఇసుక.!

**-మూడు మాసాల్లో ఉచిత ఇసుక పాలసీని రూపొందిస్తాం.**
**-నిర్మాణ రంగాన్ని పునరుద్దరిస్తాం, అందరికీ ఉపాధికల్పిస్తాం.**
**-రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**




ఆంధ్ర ప్రగతి అమరావతి, జులై 03:
రానున్న మూడు మాసాల్లో ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ఉచితంగా ఇసుకను అందరికీ అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమల్లోకి తేవడం ద్వారా నిర్మాణ రంగాన్ని పునరుద్దరించి, ఆ రంగంపై ఆధారపడిన కార్మికులు అందరికీ పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఉన్నారన్నారు. ఇందుకై రానున్న మూడు మాసాల్లో మార్గదర్శకాలను రూపొందించి పటిష్టమైన ఉచిత ఇసుక విధానాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో నిర్మాణ రంగమంతా కుధేలు అయిందని, ఆ రంగంపై ఆధారపడ్డ 40 రంగాలకు చెందిన కార్మికులు రోడ్డున పడటం జరిగిందన్నారు.


మిగతా 2లో

# జగన్ ప్రభుత్వం అరాచకం వల్లనే అమరావతి నాశనం..!

## -అమరావతిపై ఏపీ సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:


ప్రపంచంలోనే అతిపెద్ద భూ సేకరణ ప్రాజెక్టు అమరావతి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాజధాని అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఇది ఏ ఒక్కరి రాజధాని కాదని, యావత్ రాష్ట్ర ప్రజలదని తెలిపారు. ప్రతి తెలుగు బిడ్డ అమరావతి నాది అని గర్వంగా గుర్తించి చెప్పుకోవాలన్నారు. కొత్తగా ప్రణాళికలు ఏమీ లేవని, పాత వాటినే కొనసాగిస్తూ నిర్మాణం చేస్తామని తెలిపారు.




రాజధాని ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. బ్రిటీష్ మ్యూజియంలోనే అమరావతి శిల్పాలకు ఓ ప్రత్యేక మైన గ్యాలరి పెట్టారని అన్నారు. అమరావతి అనేది గతంలో ప్రముఖ నగరమని, రాష్ట్ర విభజన జరుగుతుందని, అమరావతి రాజధాని అవుతుందని ఎవరూ ఊహించలేదని, రాజధానికి అమరావతి పేరు పెట్టాలని రామోజీగ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు సూచించారని ఆయన తెలిపారు.

మిగతా 2లో

## వివేకా హత్య కేసులో కీలక సాక్షి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం.



**-వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న.!**
**-గత కొంతకాలంగా శ్వాసకోస సమస్యతో ఇబ్బంది పడుతున్న రంగన్న.**
**-ప్రస్తుతం పులివెందుల ఏరియా ఆసుపత్రిలో రంగన్నకు వైద్యం.**

ఆంధ్ర ప్రగతి పులివెందుల జులై 03:
కడప మాజీ పార్లమెంట్ సభ్యుడు వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోస సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో రంగన్నను పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడిని కడప రిమ్స్ కు రిఫర్ చేయడంతో అక్కడి తరలించడం జరిగింది.కాగా, 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందుల నివాసంలో వైఎస్ వివేకా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసును నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితులను గుర్తించి జైలుకు పంపారు. వారిలో ప్రస్తుతం కొందరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసులో నిందుతుల్లో ఒకరైన అవినాశ్ రెడ్డి కడప నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి మరోసారి గెలుపొందారు. మరో నిందితుడైన దస్తగిరి అప్రూవర్‌గా మారారు.

# ఇక నుంచి సీబీఐ కోర్టులో జగన్ కేసుల రోజువారీ విచారణ.!

**-మాజీ సీఎం జగన్ కేసుల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ చేసింది.**
**-సీబీఐ కోర్టులో ఉన్న జగన్ కేసులను రోజువారీ విచారణకు హైకోర్టు ఆదేశం జారీ చేసింది.**




ఆంధ్ర ప్రగతి హైదరాబాద్ జూలై 03:
ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీబీఐ కోర్టులో ఉన్న మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కేసులను రోజువారీ విచారణ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జగన్?పై సీబీఐ కోర్టులో 20 కేసులున్నాయని, కొన్నేళ్లుగా ఈ కేసులు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయని, త్వరితగతిన విచారణ పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేయాలని మాజీ ఎంపీ హరిరామజోగయ్య గతేడాది హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది.
విచారణలో ఎలాంటి పురోగతి లేదనివీలైనంత త్వరలో విచారణ పూర్తి చేసేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని పిటీషనర్ తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. రోజు వారీ విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రజా ప్రతినిధులపై పలు కోర్టులలో ఉన్న కేసులను కూడా హైకోర్టు ఈ సందర్భంగా విచారణ చేపట్టింది. ప్రజాప్రతినిధులపై ఉన్న కేసులను త్వరగా తేల్చాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు గతేడాది హైకోర్టు సుమోటాగా విచారణకు స్వీకరించింది. ప్రజాప్రతినిధులపై ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని ఆయా కోర్టులు ఆదేశించింది. విచారణకు సంబంధించిన నివేదికు సమర్పించాలని మూడు వారాలకు వాయిదా వేసింది.

## ఉప్పాడ సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి.!



**-సమస్యకు శాస్త్రీయ పరిష్కారం వెతకండి.!**
**-ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్.**

2లో

## ఝార్ఖండ్ సీఎం రాజీనామా



ఆంధ్ర ప్రగతి హైదరాబాద్ జులై 03:
జారఖండ్ సీఎం సోరేన్ రాజీ నామా చేశారు. బుధవారం తన రాజీనామా లేఖను గవర్నర్ కు సమర్పించారు. జార?ండ్ ముక్తి మోర్చా ప్రెసిడెంట్ హేమంత్ సోరేన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు రావడంతో చంపై సోరేన్ రాజీనామా చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు జార?ండ్ సీఎం చంపై సోరెన్ రాజీనామా సమర్పించారు. ఈరోజు మధ్యాహ్నం రాంచీలోని మాజీ సీఎం హేమంత్ సోరేన్ నివాసంలో ఇండియా బ్లాక్ ఎమ్మెల్యేల అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జార?ండ్ సీఎంగా తిరిగి బాధ్యతలు చేపట్టేందుకు హేమంత్ సోరేన్ ను ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జారఖండ్ సీఎం పదవికి చంపై సోరేన్ రాజీనామా చేశారు.హేమంత్ సోరేన్ జార?ండ్ సీఎం గా మరోసారి బాధ్యత లు చేపట్టనున్నారు.

## ఊరూరా మీసేవ కేంద్రాలు..!

**-మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరు.**
**-ఆపరేటర్లుగా ఇంటర్ చదివిన సభ్యురాళ్ల ఎంపిక.**
**-ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల రుణం.**

## జగన్ ప్రభుత్వం అరాచకం వల్లనే

# అమరావతి నాశనం..!

(మొదటి పేజీ తరువాయి)

కేబినెట్?లో పెడితే అందరూ అంగీకరించారని, అలాగే ప్రజల నుంచి కూడా ఆమోదం వచ్చిందని తెలిపారు. యమునా నది నీరు, పార్లమెంట్ మట్టిని మోదీ తెచ్చారని, వాటి మహిమ అమరావతిలో ఉందని అన్నారు. రాష్ట్రంలో ఎటుచూసినా సమదూరంలో ఉన్న ప్రాంతం అమరావతి. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఉండాలని శివరామకృష్ణ కమిటీ చెప్పిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవం తనకు ఉందని, తొమ్మిదేళ్లలో సైబరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని, కృష్ణానది నుంచి నీళ్లు తెచ్చి సైబరాబాద్‌కు ఇచ్చామని అన్నారు. జగన్ ప్రభుత్వం జాతికి ద్రోహం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు మొదలు పెట్టినా తాను నిమిత్త మాత్రుడినేనన్నారు. రాష్ట్రం రాజధాని లేకుండా మిగిలి పోయిందని అన్నారు. హైదరాబాద్ తెలంగాణకు రాజధాని అయ్యిందని, ఏపీకి రాజధాని లేకపోవడం వల్ల పెట్టుబడులు ఆగిపోయాయన్నారు. ఏం చూసి రావాలని అంతా అడుగుతున్నారన్నారు. ఒక వ్యక్తి శాపంగా మారాడని, ప్రజల పట్ల దురదృష్టంగా దాపురించాడని మండిపడ్డారు. ఇక్కడ అవకాశాలు ఉంచుకుని ఎక్కడకో ఎందుకు వెళ్లాలని సీఎం ప్రశ్నించారు. తూర్పున ఉన్న సన్ రైజింగ్ రాష్ట్రం ఏపీ అని అన్నారు. కీలక మైన పోస్టులకు ఇలాంటి వ్యక్తులు అర్హులా కాదా అన్న అంశాన్ని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. బూడిద చేసిన ఈ ప్రాంతం నుంచే అభివృద్ధికి నాంది పలకాలని అన్నారు. కొత్తగా ప్రణాళికలు ఏమి లేవు పాత వాటినే కొనసాగిస్తూ నిర్మాణం చేస్తామని తెలిపారు. గతంలోనే ఎకరా 10 కోట్ల విలువ పలికిందని చంద్రబాబు తెలిపారు. 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాజధాని నిర్మిస్తే దాని నుంచి వేల కోట్ల ఆదాయం వచ్చేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదారాబాద్?లో ఇపుడు ఆదాయం వస్తోందని చెప్పారు. 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి విక్రయించి రాజదాని నిర్మిస్తే అక్కడి నుంచే నిర్మాణాలు మొదలయ్యేవని స్పష్టం చేశారు. ప్రపంచంలో పేరు ప్రఖ్యాతలు ఉన్న సంస్థలు ఇక్కడికి వచ్చేవి సంపద పెరిగేదని వెల్లడించారు. ఒక యజ్ఞంలా చేసిన ప్రయత్నాలకు గత ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. దుష్ట శక్తుల నుంచి అమరావతి తనను తాను కాపాడుకోలేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పునరుద్ధరణ పనులు నిన్నటి నుంచే మొదలు అయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను సమీక్ష చేసి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాజధాని మారుస్తామన్న వ్యక్తిని తాను ఎవరిని చూడలేదన్న చంద్రబాబు, అలాంటి పిచ్చి వాళ్ళ నుంచి రక్షించడానికి ప్రయత్నాలు చేస్తామని స్పష్టం చేశారు. న్యాయ పరమైన అంశాలు పరిశీలించి అమరావతి పునర్నిర్మాణం చేస్తామన్నారు. కొందరు తన ఉద్దేశాలను, లక్ష్యాలను సరిగ్గా అర్థం చేసుకోలేక పోయి ఉండొచ్చని వ్యాఖ్యానించారు.

అమరావతిలో 14 ఎకరాల్లో హ్యాపీ నెస్ట్ ద్వారా మధ్య ఆదాయ వర్గాలకు ఇళ్ల చేపట్టాలని భావిస్తే దానిని వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిలిపేసిందని చంద్రబాబు ఆరోపించారు. పనుల నిలిపి వేత కారణం వ్యయం పెరిగి నష్టం జరిగిందని తెలిపారు. అమరావతిలో నిర్మించిన భవనాలు దెబ్బతిన్నాయన్నారు. రహదారులు, మౌలిక వసతుల దెబ్బతిన్నాయని, ఆర్థిక సంస్థలు వద్ద మన రేటింగ్ కూడా పడిపోయిందని చెప్పారు.

ఏపీకి రాజధాని లేదు అన్న కారణంగా పరిశ్రమలు లేవు, ఉద్యోగాలు, ఉపాధి లేదు అంతా నష్ట పోయిందని వెల్లడించారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచకం వల్ల జరిగిన నష్టం ఇదని విమర్శించారు. ప్రపంచ స్థాయి నగరం వస్తే ప్రత్యక్ష, పరోక్ష పన్నులు ఆదాయం వస్తుందని, సంపద పెరుగుతుందని చెప్పారు. ఇప్పుడు అది ప్రజలే నష్టపోయారని, మన ఆస్తుల విలువ కూడా తగ్గిందని తెలిపారు.

## చంద్రబాబును కలిసిన

# రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా..!

### -రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్‌గా మహేష్‌చంద్ర లడ్హాను ప్రభుత్వం నియమించింది.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్‌గా మహేష్‌చంద్ర లడ్హాను ప్రభుత్వం నియమించింది. ఈ తరుణంలో సచివాలయంలో సీఎం చంద్రబాబును మహేష్‌చంద్ర లడ్హా మర్యాదపూర్వకంగా కలిశారు. 1998 బ్యాచ్‌కి చెందిన మహేష్?చంద్ర లడ్హాకు శిక్షణ తర్వాత మొదటి పోస్టింగ్?ను, మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన అప్పటి విశాఖ జిల్లా చింతపల్లిలో ఇచ్చారు. నక్సల్ సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో ఏఎస్పీగా పనిచేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన లడ్హా కీలక నక్సల్ ఆపరేషన్స్ నిర్వహించారు. 2004లో ఎస్పీగా ప్రకాశం జిల్లాలో ఆయనకు తొలి పోస్టింగ్ ఇచ్చారు. గుత్తికొండ సహా ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామస్తులకు మహేష్?చంద్ర లడ్హా అవగాహన కల్పిస్తూనే, పలు ఆపరేషన్లు చేపట్టారు. నక్సల్స్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిర్ణయించినపుడు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయన కీలకంగా వ్యవహరించారు. 2005లో నక్సల్స్ ఆయన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పథకం వేశారు. ఒంగోలు రహదారిపై వెళ్తుండగా సైకిల్ బాంబును పేల్చగా లడ్హా త్రుటిలో తప్పించుకున్నారు.

అనంతరం నిజామాబాద్ ఎస్పీగా మహేష్?చంద్ర లడ్హా బదిలీ అయ్యారు. రెండేళ్ల తర్వాత గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. 2009లో గుంటూరు ఎస్పీగా పనిచేసిన ఆయన అక్కడ రౌడీయిజంపై ఉక్కుపాదం మోపారు. గురజాల, పిడుగురాళ్లలో ఫ్యాక్షనిజంపై చర్యలు తీసుకున్నారు. 2009 ఎన్నికల సమయంలో గుంటూరు జిల్లాలో రీపోలింగ్ జరగకుండా, గొడవలు చెలరేగకుండా చర్యలు తీసుకున్నారు. మొదటిసారి ఎలాంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నందుకుగానూ ఎన్నికల కమిషన్ ఆయన్ని అభినందించింది. హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా పనిచేసిన తర్వాత మహేష్‌చంద్ర లడ్హా, కేంద్ర సర్వీసులకు వెళ్లి ఎన్ఐఏలో పనిచేశారు. మక్కా మసీదు పేలుళ్ల కేసు దర్యాప్తు సహా పలు ఉగ్రవాద కార్యకలాపాల కేసులు, హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారు. అనంతరం సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా పనిచేశారు. అనంతరం విజయవాడ జాయింట్ సీపీగా విధులు నిర్వర్తించారు. కాల్ మనీ వ్యవహారంలోనూ ఆయన దర్యాప్తు చేశారు.

## ఉప్పాడ సముద్రపు కోత సమస్యకు

# శాశ్వత పరిష్కారం చూపండి..!



ఆంధ్ర ప్రగతి పిఠాపురం జూలై 03:
పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే పనిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ గారు మొదలుపెట్టారు. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోత నుంచి కాపాడే క్రమంలో కార్యాచరణకు దిగారు. బుధవారం ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర భూగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ(ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు గల కారణాలు, నివారణోపాయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది? దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ శ్రీ లక్ష్మీ నారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు, సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20 ఎకరాలు సముద్రంలోకి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. మొత్తం యు.కొత్తపల్లి మండల పరిధిలోని 8 తీర ప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకున్న పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర భూగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులు, మారిటైం బోర్డు అధికారులను సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ శ్రీ షణ్మోహన్ సగిలి, ఎంపీ శ్రీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వర్మ, జనసేన సమన్వయకర్త శ్రీ మర్రెడ్డి శ్రీనివాస్, బీజేపీ ఇంఛార్జ్ కృష్ణంరాజు, జనసేన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి శ్రీ వేములపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పూల వర్షంతో స్వాగతించిన ప్రజలుఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అధికారులతో కలిసి అధ్యయనానికి వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ ఉప్పాడ గ్రామ ప్రజలు, తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మత్స్యకార మహిళలు పూల వర్షం కురిపించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## అందరికీ అందుబాటులో

# ఉచితంగా ఇసుక..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు ఏజన్సీలకు గత ప్రభుత్వం ఇసుకను అమ్ముకోవడం ద్వారా ఆధాయాన్ని సమకూర్చుకునే అంశంపైనే దృష్టి సారించడం వల్ల కోట్లాది మంది కార్మికులు ఎంతగానో నష్టపోయారన్నారు. అటు వంటి పరిస్థితులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా ఉచితంగా ఇసుకను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి నిరంతరాయంగా నిర్మాణ రంగం కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానాన్ని నిలుపుదల చేయడంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ప్రస్తుతం వర్షాకాలం అవ్వడం వల్ల సెప్టెంబరు లోపు రీచ్ ల నుండి ఇసుక త్రవ్వకాలకు వీలుండదన్నారు. రానున్న పది పదిహేను రోజుల్లోపు రాష్ట్రంలో అధికారికంగా, అనధికారికంగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లను గుర్తించి వాటిల్లో అందుబాటులో ఉన్న ఇసుకను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రానున్న మూడు మాసాల పాటు దాదాపు కోటి టన్నుల ఇసుక అవసరం అవుతుందని అంచనావేయడం జరిగిందన్నారు. స్టాక్ పాయింట్ల నుండి ఇసుక రవాణా చేసే వాహనాల చార్జీలను కూడా నియంత్రించి అతి తక్కువ చార్జీలకే ఇసుక రవాణా అయ్యే విధంగా, ఇసుక బ్లాక్ మార్కెటింగ్ కాకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ఊరూరా మీసేవ కేంద్రాలు..!

ఆంధ్ర ప్రగతి అమరావతీ జులై 03:ఆన్లైన్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన వందలాదిసేవలందిస్తున్న మీ సేవ కేంద్రాలను ఊరూరా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మహిళాశక్తి పథకం కింద రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వీటినిమంజూరు చేయనుంది. కేంద్రాలు ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను తాజాగా ఆదేశించింది. ఆగస్ట్ 15 నాటికి వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4,525 మీ సేవకేంద్రాలున్నాయి. వీటిలో మూడు వేల వరకు నగర, పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో 12,769గ్రామ పంచాయతీలుండగ వేయిన్నర వరకే గ్రామాల్లో ఉన్నాయి. ధ్రువీకరణ పత్రాల తోపాటు ఆధార్ సేవలు, దరఖాస్తులు, చెల్లింపులు సహా 150కి పైగా ప్రభుత్వ, 600కు పైగా ప్రైవేటు కార్యకలాపాలకోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలు, నగరాల్లోని కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళాశక్తి పథకం కింద మీసేవ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. గ్రామైక్య సంఘాల(విలేజ్ ఆర్గనైజేషన్) పేరిట మహిళా శక్తి మీసేవ కేంద్రాలను (ఎమ్మెస్ ఎమ్మెస్సీ) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కేంద్రం ఏర్పాటుకు రూ.2.50 లక్షల రుణాన్ని స్త్రీనిధి ద్వారాపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. వీటితో ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పేరొందిన కంపెనీల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ కొనుగోలు చేయాలి. కేంద్రాలు ప్రారంభమైన తర్వాత ఆయా సంఘాలు రుణాన్ని నెలనెలా తిరిగి చెల్లించాలి. స్త్రీనిధి, స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, రైతు వేదిక, అంగన్వాడీ కేంద్ర భవనాలు లేదా ఇతర ప్రభుత్వ భవనాలు, వాటి ప్రాంగణాల్లో మీసేవ కేంద్రానికి 10 అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పుతో వసతి కల్పిస్తారు. ఆయా సంఘాల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన సభ్యురాళ్లను మీ సేవ ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారు. కేంద్రం నిర్వహణ, సేవలపై మీ సేవ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా మహిళా సంఘాలతో మీసేవ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంటుంది.ం

## టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సమయమివ్వాలని ప్రభుత్వం నిర్ణయం..!

### - త్వరలో కొత్త తేదీలు ప్రకటన.

**-రాష్ట్రంలో టెట్, మెగా డీఎస్సీ అభ్యర్థుల అభ్యర్థన మేరకు పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.**

**-ఈ క్రమంలో పరీక్షల కోసం సన్నద్ధం అవ్వడానికి మరింత సమయం ఇవ్వాలని నిర్ణయిస్తూ టెట్ నిర్వహణకు నోటిఫికేషన్ జారీచేసింది.**



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
టెట్, మెగా డీఎస్సీ అభ్యర్థుల అభ్యర్థన మేరకు పరీక్షల కోసం సన్నద్ధం అవ్వడానికి మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేర ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే 16,347 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైల్?పై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం ప్రక్రియను ఆరు నెల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న వారికి కూడా మెగా డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించేలా టెట్ నిర్వహించాలని వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొని టెట్ నిర్వహించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవ్వడానికి తమకు మరింత సమయం ఇవ్వాలని అభ్యర్థులు, వివిధ విద్యార్థి, యువజన సంఘాలు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్?ను కలిసి విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల వినతుల మేరకు మంత్రి లోకేశ్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. దీనిపై అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత అభ్యర్థుల పరీక్ష రాయడానికి సన్నద్ధం అవ్వడానికి మరింత సమయం ఇవ్వాలని నిర్ణయించారు. టెట్ పరీక్ష నిర్వహణకు 90 రోజులు, మెగా డీఎస్సీ నిర్వహణకు 90 రోజుల సమయం ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే టెట్, డీఎస్సీ నిర్వహణకు కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించనుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 4 జూలై 2024

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల జిల్లా నూతన కలెక్టర్ రాజకుమారి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 03:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా నంద్యాల కు బదిలీ అయిన కలెక్టర్ రాజకుమారి కలిశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కిందిస్థాయి అధికారులను సమన్వయపరచుకొని చక్కటి పరిపాలన అందించాలని సూచించడం జరిగింది . నంద్యాలలో అందరి అధికారులతో కలిసి పనిచేసే నంద్యాల జిల్లా అభివృద్ధి చేయాలని సూచించారు . అలాగే వివాదాస్పదమైన పనులను చేయకుండా అందర్నీ కలుపుకుంటూ పోయి నంద్యాల జిల్లాకు సుపరిపాలన అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన నంద్యాల జిల్లాకు బదిలీ అయినా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. మంత్రివర్యులు ఫరూక్ గారు సూచించినట్లు నంద్యాలకు సుపరిపాలన అందిస్తానని అందరినీ సమన్వయం చేసుకుంటూ పరిపాలన సాగిస్తానని తెలియజేయడం జరిగింది.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో భేటీ అయిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
బుధవారం రాష్ట్ర సచివాలయం అమరావతిలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పేషియోలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ మంత్రివర్యులు పొంగూరు నారాయణ భేటీ అయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ ఏ విధంగా అభివృద్ధి చేయాలో చర్చించడం జరిగిందన్నారు. గత వైఎస్ఆర్సిపి పాలనలో మున్సిపాలిటీని అస్తవ్యస్తం చేశారని ఒక్క పని కూడా చేయకుండా మున్సిపల్ నిధులన్నీ స్వాహా చేశారని అభివృద్ధి నిల్ పబ్లిసిటీ ఫుల్ అనే విధంగా గత ప్రభుత్వ నాయకులు అవలంబించారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అలాంటివి ఏమీ ఉండవని కేవలం అభివృద్ధి పైనే తమ దృష్టి అంత ఉంటుందని నంద్యాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్ లోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దే బాధ్యత నాది అని ఫరూక్ తెలియజేశారు. అనంతరం మంత్రివర్యులు నారాయణ మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి కావలసిన నిధులు కచ్చితంగా కేటాయిస్తామని నంద్యాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## మహానంది దేవస్థానంలో
# ఇద్దరు ఉద్యోగుల సస్పెండ్



ఆంధ్ర ప్రగతి మహానంది జులై 03:
ముగ్గురు తొలగింపుటకు రంగం సిద్ధం. పల్లె వెలుగు మహానంది. మహానంది దేవస్థానంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు విశ్వాసనీయ సమాచారం. ముగ్గురు ఏజెన్సీ ఉద్యోగులను తొలగించడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. మహానంది దేవస్థానంలో బుధవారం సాయంత్రం ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి తనిఖీ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా దాదాపు 309 చిన్న లడ్డు మరియు 4190 నగదు తనిఖీల్లో భాగంగా తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఉదయం షిఫ్టులో పనిచేసే ఒక ఆలయ ఉద్యోగి డ్యూటీ అనంతరం నగదు డిపాజిట్ చేయకపోవడంతో పాటు చిన్న లడ్డులు 309 తక్కువగా ఉన్న కారణంగా మరో ఉద్యోగిని తనిఖీల అనంతరం సస్పెండ్ చేసినట్టు తెలుస్తుంది. విధులలో ఉండాల్సిన ఏజెన్సీ ఉద్యోగులు ముగ్గురు ఇతర చోట్ల ఓ... బృహత్తర కార్యక్రమంలో నిమగ్నమై విధులకు దూరంగా ఉన్నారని గుర్తించి వారిని విధుల నుంచి దూరం/ తొలగింపు చేయనున్నట్లు సమాచారం.

## అమ్మవారికి భక్తులు సమర్పించిన
# చీరలపై విచారణ




ఆంధ్ర ప్రగతి మహానంది జులై 03: మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు/ కానుకలు పై రహస్యంగా విచారణ చేస్తున్నట్లు అత్యంత విశ్వాసనీయ సమాచారం. గత కొన్ని రోజుల నుంచి అమ్మవారికి సమర్పించిన చీరల్లో గోల్మాల్ జరిగిందనే సమాచారం మేరకు విచారణ చేస్తున్నట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. భక్తులు అమ్మవారికి సమర్పించిన వాటికి సంబంధించి రసీదుల్లో పొందుపరిచిన/ పొందుపరచని వాటిపై విచారణ చేస్తున్నట్టు తెలుస్తుంది. దాదాపు రెండు మూడు నెలల నుంచి సమర్పించిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించి విచారం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి కొందరిని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఒకరిద్దరి సిబ్బందిని వీటికి సంబంధించిన స్థానాల నుంచి తప్పించి విచారణ చేస్తున్నట్టు తెలుస్తుంది .ఇంతకు మహానంది క్షేత్రంలో గత మూడు నెలల నుంచి నివురు కప్పిన నిప్పులా ఏమి జరిగింది ఏమి జరుగుతుంది అనేది తేలాల్సి ఉంది.

# వసూళ్ల పేరుతో
# ఖాతాదారులను బెదిరిస్తున్న వైనం

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 03:



నంద్యాలలోని కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు తక్కువ వడ్డీ పేరుతో హౌమ్ లేదా పర్సనల్ లోన్ ఇతరత్రా పేర్లతో లోన్లు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, కొన్ని నెలల తర్వాత వాటిని వసూళ్ల పేరుతో ఖాతాదారులను తీవ్ర బెదిరింపులకు గురిచేస్తూ , హైకోర్టులో మీపై క్రిమినల్ కేసులు నమోదు చేశాయనీ , జైళ్లకు పంపిస్తామనీ తరుచూ ఫోన్ కాల్స్ చేస్తూ ఇళ్ల వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారనీ తక్షణమే నంద్యాలలోని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై అధికారులు , పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ వామపక్ష పార్టీ (ఏ.ఐ.ఎఫ్.బి) రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు , ఏపీ డెమొక్రటిక్ విద్యార్థి , యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేక్ రియాజ్ అధికారులను కోరారు. బుధవారం నాడు నంద్యాలలోని స్థానిక పార్టీ కార్యాలయంలో విలేఖర్లతో వారు మాట్లాడుతూ..నంద్యాల జిల్లా కేంద్రానికి వివిధ ప్రాంతాల నుండి గ్రామీణ ప్రజలు బజాజ్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సున్నా వడ్డీకే వస్తువులు అని ప్రచారాలు నమ్మి, ప్రజలు గృహోపకరణాలు , ఎలక్ట్రానిక్స్ వస్తువులు , సెల్ ఫోన్స్ తీసుకుంటున్న ప్రజలకు ఈఎంఐల సకాలంలో చెల్లించినా చెక్ బౌన్సుల పేరిట భారీ వసూళ్లు చేస్తుందనీ,అలాగే కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలలో వాహనాలు , ఇంటి లోన్లు , పర్సనల్ లోన్స్ తీసుకున్న ఖాతాదారులు రుణాలు చెల్లిస్తున్నప్పటికీ ఇంకా చెల్లించాలనీ బలవంతపు వసూళ్లు చేస్తున్నారనీ , అలాగే తీసుకున్న లోన్ పూర్తి చేసినా ఇంకా వడ్డీ చెల్లించాలనీ తీవ్ర ఒత్తిడి చేస్తున్నారనీ , కోర్టులో మీపై కేసులు వేశామనీ , త్వరలో జైళ్లకు పంపుతామని బెదిరిస్తున్నారనీ రాజునాయుడు , రియాజ్ తెలిపారు.
ఇప్పటికైనా ప్రభుత్వం , అధికారులు స్పందించి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల అక్రమ , బలవంతపు వసూళ్లపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం.
## -జూలై 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్.




ఆంధ్ర ప్రగతి పాణ్యం జూలై 03:
బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు డిగ్రీ, కళాశాల లోని,విద్యార్థులతో కలిసి జులై 4న జరిగే విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి బత్తిని ప్రతాప్, మండల అధ్యక్షులు ,కార్తీక్ ,కార్యదర్శి లు వేణు, రాజు , మధు విద్యార్థులు కలిసి బంద్ కు సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఎం ఈ ఓ సుబ్రహ్మణ్యం కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....
బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యారంగాన్ని విచ్చిన్నం చేస్తున్నదని అందులో భాగంగానే కేంద్రం రాష్ట్రం యొక్క విద్యా హక్కులను కాలరాస్తూ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్టీఏ లాంటి సంస్థలను రద్దు చేయాలి. నీట్ పరీక్షను రాసి నష్టపోయిన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని నీట్ పరీక్ష రద్దుపై నైతికంగా కేంద్ర కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులపై కేసులు సరైనది కాదని
పాఠశాలలు మూసివేతలను ఆపాలని పి హెచ్డిఅడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న పరీక్షల్లో నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని అలాగే తిరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫెలోషిప్లు పెంచాలని, విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసాయి, మధు, కిషోర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జరగబోయే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు డివైఎఫ్ఐ మద్దతు




ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 03:
కేంద్రంలో నీట్ పరీక్ష ఫలితాలలో జరిగిన అవగతవగలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన దేశ వ్యాప్త విద్యాసంస్థల బందుకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి ఎస్. ఎస్ శివ తెలిపారు. మంగళవారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హయాంలో ఇప్పటికే 65 సార్లు పేపర్లు లీకులు అయ్యాయన్నారు. ఇది లీకుల ప్రభుత్వమని కొనియాడారు. నీటి పరీక్షలలో జరిగిన అవకతవకుల కారణంగా దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్యోగ్యోచరంగా తయారైందన్నారు. నీటిలో తవకలు జరిగాయని స్పష్టంగా అర్థమవుతున్న పార్లమెంటు దేశ ప్రధాని నరేంద్ర మోడీ విద్యాశాఖ మంత్రి దీనిపై చర్చించకపోవడం నిస్సిగ్గుగా ఉందన్నారు. ఒకవైపు దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ భవిష్యత్తు అన్యాయం జరిగిందని తల్లిదండ్రులు వాపోతున్నారని అయినా జరిగిన ఈ పేపర్ లీక్ లో బాధ్యుల పైన పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. కావున నీట్ పేపర్ లీక్ లలో జరిగిన అవకతవగలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కావున లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన తీరుని నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు జులై 4న బందుకు పిలుపునివ్వడం జరిగిందని ఈ బందుకు డివైఎఫ్ఐ నంద్యాల కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ప్రత్యక్షంగా ఇబ్బందులు పాల్గొంటామని కావున జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ కు సహకరించాలని విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు సాయి, నడిగడ్డ మా భాష, బొగ్గు లేని సాయి, సహాయ కార్యదర్శి బన్నీ, ప్రసాద్ లు పాల్గొన్నారు.

## రాష్ట్ర విభజన లోని అంశాల పరిష్కారం కోసం
# చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 03:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన జరిగి పది సంవత్సరాలైనా అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్న నేపథ్యంలో, వీటి పరిష్కార దిశగా చొరవ తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, సానుకూలంగా స్పందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అభినందనలు తెలిపిన రాయలసీమ సాగునీటి సాధన సమితి అద్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి.
రాష్ట్ర విభజన చట్టంలో ఇరు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చలకు ఈ నెల 6 వ తారీఖున సిద్ధమైన వేళ సాగునీటి రంగంలో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ చంద్రబాబు నాయుడు కి మెయిల్ ద్వారా లేఖను దశరథరామిరెడ్డి పంపారు. ఈ సందర్భంగా నంద్యాల సమితి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాగునీటి రంగంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతాలు రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రాంతం అనీ, రాష్ట్ర విభజన అనంతరం కూడా విభజన అంశాల పరిష్కారంలో జాప్యం వలన నష్టపోతున్నది కూడా ఈ ప్రాంతాలేనని ఆవేదన వ్యక్తం చేశారు.
రెండు తెలుగు రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రాంతాల సాగునీటి రంగ అభివృద్ధికి రాజ్యాంగబద్ధమైన హక్కులను, రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను దృష్టిలో ఉంచుకొని రెండు ప్రాంతాల అభివృద్ధికి మీరు కృషి చేయాలనీ, ఈ అంశాలపై ఈ నెల ఆరో తారీఖున చేపడుతున్న చర్చలలో దిగువ పేర్కొన్న అంశాలకు ప్రాధాన్యతనిచ్చి, వీటి పరిష్కారానికి పాటుపడాలని లేఖలో చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు.
ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, మహమ్మద్ పర్వేజ్, మహేశ్వరరెడ్డి,కొమ్మా శ్రీహరి, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదా తీర్మానాలు చేస్తే ఇచ్చేది కాదు

**ఏపీకి ప్రత్యేక హోదాపై స్పందించిన కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ**
**హోదాపై నిర్ణయం తీసుకోవాల్సింది ప్రధాని మోదీ అని వెల్లడి**
**బీహార్ రాష్ట్రానికి ఇదే వర్తిస్తుందని స్పష్టీకరణ**



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
ప్రత్యేక హోదా... రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానాలు చేసినంత మాత్రాన ఇచ్చేది కాదని, అలా అయితే దేశంలోని అన్ని రాష్ట్రాలు కూడా చేస్తాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కార్యాలయంలో 'అమ్మ' పేరుతో ఆయన మొక్క నాటారు. అనంతరం మాట్లాడుతూ... ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై తాను ఇప్పుడే ఏమీ చెప్పలేనన్నారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది ప్రధాని మోదీయే అన్నారు. బీహార్ రాష్ట్రానికీ ఇదే వర్తిస్తుందని స్పష్టం చేశారు. హోదా ఎందుకు ఇవ్వలేదో గతంలోనే స్పష్టంగా చెప్పామన్నారు. ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నట్లు చెప్పారు. ఆ నిధుల ద్వారా ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ఏపీ అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలో ఆలోచించి ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం కారణంగా పోలవరం సమస్యల్లో ఉందన్నారు. పోలవరం నిర్మాణానికి కేంద్రం సహకారం ఉంటుందన్నారు.

# ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా వచ్చిన 'కూ' మూత!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
'ఎక్స్' (ట్విట్టర్)కు ప్రత్యామ్నాయంగా వచ్చిన స్వదేశీ మైక్రోబ్లాగింగ్ 'కూ' మూతపడింది. ఆర్థిక ఇబ్బందులతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవస్థాపకుడు అప్రమేయ రాధాకృష్ణ, కోఫౌండర్ మయాంక్ బిదావత్కా లింక్డ్ఇన్‌లో ఒక పోస్ట్ ద్వారా ప్రకటించారు. ఆన్‌లైన్ మీడియా సంస్థ డైలీహంట్ సహా వివిధ కంపెనీలతో విక్రయానికి చర్చలు జరిపినా అవి విఫలం కావడంతో తాజాగా తమ కార్యకలాపాలను నిలిపి వేసింది. టైగర్ గ్లోబల్, యాక్సెల్, 3%శీఅవ%4 క్యాపిటల్, కలారి క్యాపిటల్, బ్లూమ్ వెంచర్స్ వంటి ప్రముఖ పెట్టుబడిదారుల నుండి %వి%50 మిలియన్లకు పైగా సేకరించినప్పటికీ కూ తన వినియోగదారుల సంఖ్యను పెంచుకోలేకపోయింది. దీంతో గతేడాది ఆదాయాన్ని సంపాదించడానికి చాలా కష్టపడింది. ఇక 2020లో అప్రమేయ రాధాకృష్ణ, మయాంక్ బిదావత్కా దీన్ని స్థాపించగా దాదాపు 60 మిలియన్ డౌన్‌లోడ్‌లు జరిగాయి. 10కి పైగా భాషల్లో అందుబాటులో ఉన్న మొట్టమొదటి ఇండియన్ మైక్రోబ్లాగింగ్ సైట్‌గా ఇది గుర్తింపు పొందింది. ఈ యాప్ లోగో కూడా దాదాపు ట్విట్టర్‌ను పోలి (పక్షి) ఉంటుంది.కాగా, రైతు ఉద్యమ సమయంలో అకౌంట్ల బ్లాకింగ్ విషయంలో ట్విట్టర్‌తో కేంద్రానికి ఘర్షణ నెలకొన్నప్పుడు కూ బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రులే స్వయంగా దీన్ని ఆత్మనిర్భర్ యాప్‌గా ప్రమోట్ కూడా చేశారు. దీంతో తక్కువ సమయంలోనే 'కూ'కు వినియోగదారుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ క్రమంలో నైజీరియా, బ్రెజిల్ వంటి దేశాలకు కూడా తన కార్యకలాపాలను విస్తరించింది. కానీ, ఆ తర్వాత ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి చేరింది. వాటి నుంచి బయటపడేందుకు వివిధ కంపెనీలతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. చివరకు మూసివేతకు దారితీసింది.




# 132 సీట్లతో అధునాతన బస్సులు

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి**




ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఇందులో భాగంగానే 132 సీట్లతో కూడిన బస్సులను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. భారీ సీట్లు కలిగిన బస్సు పైలట్ ప్రాజెక్టు నాగ్‌పూర్‌లో కొనసాగుతోందనిజరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు.'కాలుష్యం ముప్పును ఎదుర్కొనేందుకు కాలుష్యరహిత ఇంధనం, స్వదేశీ పరిజ్ఞానం, తక్కువ ఖర్చు వంటి పరిష్కార మార్గాలు అవసరం. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. వందల సంఖ్యలో ఇథనాల్ పంపులు ఏర్పాటు అవుతున్నాయి. రూ.120 లీటరు పెట్రోల్‌కు ఖర్చుపెట్టే బదులు రూ.60తో ఇథనాల్ వాడటం ఉత్తమం. డీజిల్ బస్సు కి.మీ. ప్రయాణానికి రూ.115 ఖర్చు అవుతుంది. అదే ఎలక్ట్రిక్ ఏసీ బస్సుకు రూ.50 నుంచి రూ.60 అవుతుంది. దీంతో టికెట్ ధర 15 నుంచి 20 శాతం తగ్గుతుంది' అని సూచించారు.అలాగే టాటా సహకారంతో నాగ్‌పూర్‌లో ఓ పైలట్ ప్రాజెక్టు చేపట్టాం. మన ప్రాజెక్టులోనూ 132 మంది కూర్చునేవిధంగా బస్సును రూపొందిస్తున్నాం. 40 కి.మీ. దూరం వెళ్లాక ఛార్జింగ్ చేసుకోవాలి. కేవలం 40 సెకన్ల పాటు ఛార్జింగ్ చేస్తే 40 కి.మీ. వెళ్లొచ్చు. కి.మీ. ఖర్చు రూ.35 నుంచి రూ.40 మాత్రమే అవుతుంది. ఈ బస్సులో విమానంలోలా సీటింగ్, ఏసీ, సీటు ముందు ల్యాప్‌టాప్ పెట్టుకొనే సౌలభ్యం ఉండాలని సూచించాం. ఎయిర్ హోస్టెస్ మాదిరిగా ఫ్రూట్స్, ప్యాక్ డ్ ఫుడ్, కూల్ డ్రింక్స్ ఇచ్చేందుకు 'బస్ హోస్టెస్' ఉంటారు. డీజిల్ బస్సుతో పోలిస్తే దీని నిర్వహణకు 30శాతం ఖర్చు తగ్గుతుందని ఆయన తెలిపారు.

## ఏపీపీఎస్సీ చైర్మన్ పదవికి గౌతమ్ సవాంగ్ రాజీనామా




ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్కు అందజేయగా ఆయన ఆమోదించారు. వైసీపీ హయాంలో 2019 మే నుంచి 2022 ఫిబ్రవరి వరకు ఈయన డీజీపీగా పని చేశారు. ఆ తర్వాత ఏపీపీఎస్సీ చైర్మన్ అయ్యారు. పదవీ విరమణకు రెండేళ్ల ముందే సవాంగ్ రాజీనామా చేశారు.


## భక్తులను మోసం చేస్తున్న దళారులపై చట్టపరమైన చర్యలు : టీటీడీ ఈఓ



తిరుమలఆంధ్ర ప్రగతి జూలై 03:
టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టీటీడీ ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని ఆలోచిస్తున్న టీటీడీ ఈవో.. ఇప్పుడు దళారీ వ్యవస్థను నిర్మూలించడంపై దృష్టి సారించారు. అందులో భాగంగా నేడు (బుధవారం) తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో టీటీడీ ఈవో పోలీసు, టీటీడీ నిఘా, భద్రతా విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ%ౌ% తిరుమల శ్రీవారి భక్తులను మోసం చేస్తున్న దళారులను గుర్తించి వారిపై ఎప్పటికప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇప్పటివరకు దళారులనపై నమోదైన కేసులను వారం రోజుల్లో పరిష్కరించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వసతి, దర్శనం, అర్థతసేవ టిక్కెట్ల విషయంలో భక్తులను మోసం చేస్తున్న దళారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈఓ అధికారులను ఆదేశించారు.

# వైట్ సూట్.. కళ్లకు అద్దాలు
# ఈ భోలే బాబా స్టైలే వేరు

**ఉత్తరాది రాష్ట్రాల్లో ఫుల్ క్రేజ్**
**సత్సంగ్ పేరుతో కార్యక్రమాలు**
**దేవుడి ధూతగా చెప్పుకుంటున్న బాబా**





**ఆంధ్ర ప్రగతి జూలై 03:**
యూపీలోని హాథ్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో 121 మంది మృతిచెందారు. భోలే బాబా నిర్వహించిన సత్సంగ్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. బాబా అసలు పేరు నారాయణ్ సాకార్ హరి. తనను తాను దేవుడికి శిష్యుడిగా ప్రకటించుకొని ఆధ్యాత్మిక ప్రసంగాలు ఇస్తుంటాడు. తొక్కిసలాటలో మృతిచెందిన వారంతా ఈయన భక్తులే. నారాయణ్ హరి స్వస్థలం యూపీలోని ఈటా జిల్లాలో బహదూర్ గ్రామం. గతంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో పనిచేసినట్లు ఆయనే చెప్పుకున్నారు. ఆధ్యాత్మిక జీవితం కోసం 26 ఏండ్ల క్రితం ఉద్యోగాన్ని వదిలేశానని చెబుతుంటాడు. ఆయన అనుచరులు అలీగఢ్‌లో ప్రతి మంగళవారం సత్సంగ్ నిర్వహిస్తుంటారు. కాషాయ వస్త్రాలు ధరించకుండా, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ.. ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయటం ఈయన స్టైల్‌గా చెప్పుకోవచ్చు. ఖరీదైన అద్దాలు, తెల్లని సూట్, టై ధరించి ఈయన నిర్వహించే 'సత్సంగ్' కార్యక్రమాలకు పశ్చిమ యూపీలో భక్తులు పెద్ద ఎత్తున ఉన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా భోలే బాబాకు లక్షల మంది అనుచరులు ఉన్నారు. భోలే బాబాను సూరజ్ పాల్ సింగ్ అని కూడా కొందరు భక్తులు పిలుస్తుంటారు. యూపీ పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా చేశాడు. ఆ శాఖతో అనుసంధానమైన ఇంటెలిజెన్స్ యూనిట్‌లో సుమారు 18 ఏళ్లు పనిచేసినట్లు చెప్పుకుంటాడు. 1999లో స్వచ్ఛంధ పదవీవిరమణ తీసుకున్నాడు. సూరజ్ పాల్ సింగ్ ఋంచి నారాయణ్ సాకార్ హరిగా అతని పేరు మార్చుకున్నాడు. ఆ తర్వాత సత్సంగ్‌లు నిర్వహించడం మొదలుపెట్టాడు. ఆధ్యాత్మికత, ప్రపంచ శాంతి దిశగా తన మనసు మారినట్లు ఆయన తన అనుచరులకు చెప్పేవాడు.



హాథ్రస్ ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని, దీనిపై కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ అభ్యర్థించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఐదుగురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ఆ పిటిషన్?లో పేర్కొన్నారు. అటు ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని అలహాబాద్ హైకోర్టులో మరో వ్యాజ్యం దాఖలైంది.

ఉత్తర్‌ప్రదేశ్ హాథ్రస్‌లో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 121 మంది ప్రాణాలు విడిచారు. మరో 28 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారని, మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. భోలే బాబా సత్సంగ్ పేరుతో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఉత్తర్?ప్రదేశ్?లోని వేర్వేరు జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత భోలే బాబా వెళ్లిపోతుండగా భక్తులు ఆయన పాదాలను తాకటానికి పరుగెత్తారు. వేదిక సమీపంలో ఉన్న కాలువ నుంచి నీరు పొంగి పొర్లటంతో రహదారి బురదమయంగా మారింది. దీంతో భక్తులు ఒకరిపై ఒకరు జారిపడటం వల్ల తొక్కిసలాట జరిగినట్లు తెలుస్తోంది. అయితే.. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఇంకా పెరగొచ్చని అధికారులు, డాక్టర్లు చెప్తున్నారు. కాగా, ఆధ్యాత్మిక కార్యక్రమాల

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

**నాసిరకం విత్తనాలు అమ్మితే లైసెన్స్ లు రద్దు**
**సహకార రంగం ద్వారా ఎరువులు పంపిణి**
**అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు**



అమరావతి ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 03:
ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. దీనిలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 46.45 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు అవుతోంది.. నకిలీ విత్తనాలకు చెక్ పెట్టాలని స్పష్టం చేశారు.. నకిలీ విత్తనాలు సరఫరా చేసే కంపెనీలపై చర్యలకు వెనుకాడొద్దని ఆదేశించారు. అనుమతి లేని రకాలు, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్లో వేసే పంటలకు ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు.
ఇక, వరి, మొక్కజొన్న, కందులు, పెసర్లు, పత్తి, చిరు ధాన్యాలు, ఉద్యాన పంటల రైతులకు అండగా నిలబడాలని సూచించారు సీఎం చంద్రబాబు.. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.. మరోవైపు, రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ద్వారా ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడుకు ఆదేశాలు జారీ చేశారు. భూసార పరీక్షలకు కేంద్రం రూ. 20 కోట్లు కేటాయించామని,. సద్వినియోగం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు.. ఖరీఫ్ సీజన్లో 4 లక్షల భూసార పరీక్షలు చేయాలని సూచించిన ఆయన.. ప్రకృతి వ్యవసాయం, బిందు సేద్యం ప్రోత్సహించి సాగు విస్తీర్ణం పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు చంద్రబాబు